ఘనంగా మహానగర సంకీర్తన



సంకీర్తన ర్యాలీలో పాల్గొన్న వేదాంత చైతన్యదాస్, శంభువైష్ణవ్‌దాస్, నవీన్, భక్తులు



ప్రసంగిస్తున్న వేదాంత చైతన్యదాస్

చిక్కడపల్లి: ఇస్కాన్ అబిడ్స్ ఆధ్వర్యంలో మహానగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ దుర్గానిలయం నుంచి ప్రారంభమైన సంకీర్తన ర్యాలీ భక్తుల హరే కృష్ణ..హరేరామ రామ గానం చేస్తూ శ్రీ ధ్యానగణపతి దేవాలయం వరకు కొనసాగింది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు వేదాంత చైతన్యదాస్, కార్యదర్శి శంభువైష్ణవ్‌దాస్, ఎంఎస్ రామారావు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.శ్రీనివాస్‌స్వామి, భక్తులు నవీన్, సత్యనారాయణ, గంగాధర్, మురికిగణేష్, ఆంజనేయులు, శ్రీనివాస్‌రావు, చిలుకూరి అఖిలేష్, శివ, ఆర్‌వీజీ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



రవీందర్‌నాయక్‌కు అభినందనలు తెలుపుతున్న కళ్యాణ్‌నాయక్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా ఆరోగ్య సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ బి.రవీందర్‌నాయక్‌ను సేవాలాల్ సేనా హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు వడిత్య కళ్యాణ్‌నాయక్, గూగుల్ ప్రవీణ్‌నాయక్ ఆదివారం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌నాయక్ మాట్లాడుతూ నిస్వార్థ సేవకులైన రవీందర్‌నాయక్‌కు అత్యున్నత పదవీ లభించడం ఆనందదాయకమన్నారు. ప్రజా సేవకు అంకితభావంతో కృషి చేస్తానని రవీందర్‌నాయక్ పేర్కొన్నారు.

రమేష్ యాదవ్ కుటుంబ సభ్యులకు కేంద్ర మంత్రి పరామర్శ



కన్నె రమేష్ యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

కాచిగూడ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ సోదరుడు కన్నె నర్సింహ్మా యాదవ్ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కాచిగూడలోని కన్నె రమేష్ యాదవ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సింహ్మా యాదవ్ భార్య లక్ష్మీ, కుమారులు నవీన్ రాజు, కిరణ్, మల్లేష్ యాదవ్, సురేష్ యాదవ్, రాజ్‌మోహన్‌లను ఓదార్చిన కిషన్ రెడ్డి వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, కృష్ణ కుమార్, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, బాబన్న, ఎస్.రవియాదవ్ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓంప్రకాష్ చౌతాలా జన్మదిన వేడుకలు

కాచిగూడ: లోక్‌దళ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాష్ చౌతాలా జన్మదిన వేడుకలను ఆదివారం నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప ప్రధాని దేవీలాల్ వారసుడిగా రాజకీయాల్లో తనదైన శైలిలో రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరు వెంకట రాజేశ్వర్ రావు అన్నారు. కాంగ్రెసేతర శక్తుల ఏకీకరణలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు ఎందరికో రాజకీయ భవిష్యత్‌ను కల్పించిన మహానేత ఓంప్రకాష్ చౌతాలా అన్నారు. చౌతాలా నాయకత్వంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య రైతులు, కార్మికులు ఏకం కావాలన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

హరినగర్ బస్తీ అధ్యక్షుడిగా భీవనపల్లి రమేష్ ఎన్నిక

ముషీరాబాద్: దక్షిణ భారత సేవా సమాజ్(హరినగర్ బస్తీ) అధ్యక్ష పదవి కోసం ఆదివారం జరిగిన ఎన్నికల్లో కప్పుసాసర్ గుర్తుపై పోటీ చేసిన భీవనపల్లి రమేష్ ఘన విజయం సాధించారు. మొత్తం 600 ఓట్లకు గాను 495 ఓట్లు పోల్ అయ్యాయి. మూడు ఓట్లు నోటాకు పడగా గడియారం గుర్తుపై పోటీ చేసిన గజ్జల సూర్యనారాయణకు 87 ఓట్లు, వాలీబాల్ గుర్తుపై పోటీ చేసిన కుషాల్‌కుమార్‌కు 115 ఓట్లు రాగా, భీవనపల్లి రమేష్‌కు 290 ఓట్లు వచ్చాయి. 175 ఓట్ల మెజార్టీతో రమేష్ గెలుపొందినట్లు ఎన్నికల పరిశీలకులు కేశవపురం స్వామి, జి.రుషికేశ్వర్‌రావు, గడ్డం బాలకృష్ణ, నేరేళ్ల బాలయ్య, దార్ల రఘు ప్రకటించారు. అనంతరం రమేష్ తన మద్దతుదారులతో కలిసి హరినగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. తన విజయానికి కృషి చేసిన గడ్డం నవీన్, నేరేళ్ల రాకేష్, ఇళ్లందుల రాకేష్, మేకల సత్యనారాయణ, ప్రసాద్, రాములకు కృతజ్ఞతలు తెలిపారు.

18వ పడి అయ్యప్ప స్వాములకు సన్మానం



స్వాములను సన్మానిస్తున్న దృశ్యం

కాచిగూడ: అయ్యప్ప మాలదారులై 18 సంవత్సరాలు దీక్ష పూర్తిచేసుకున్న అయ్యప్ప స్వాములను ఆదివారం శ్రీ జవంతీశ్వరన్ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 18 సంవత్సరాల దీక్షను పూర్తి చేసుకున్న మధు గురుస్వామి, గౌతం రావు గురుస్వాములు కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి శబరిమలకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన ఇరుముడి, పడి పూజా కార్యక్రమంలో వారిని సంఘం అధ్యక్షుడు జిఎస్‌సీ బోసు గురుస్వామి, ప్రధానకార్యదర్శి విష్ణు తోబుల గురుస్వామి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్ గురుస్వామి, ప్రవీణ్ కుమార్ లక్కాకుల గురుస్వామి, ఆనంద్ గురుస్వామి, భగత్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.5 భోజనంలో నాణ్యత పాటించాలి



సమావేశంలో పాల్గొన్న పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ సభ్యులు

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో రూ.5 భోజన పథకం అమలుకు నిధులు పెంచి, నాణ్యత పాటించాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్(పివైఎల్) గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో అమలు చేసే రూ.5 భోజనాకికి నిధులు సరిపోవడం లేదని, దీనికి అవినీతి తోడవడంతో నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. జీహెచ్‌ఎంసీ నుంచి రూ.19 ఇస్తుండగా, ప్రజల నుంచి రూ.5 తీసుకుంటున్నారన్నారు. గ్రేటర్‌లో 200పైగా కేంద్రాల్లో ఈ పథకం అమలవుతుందన్నారు. ఈ భోజనంపై ఆధారపడి నిరుద్యోగులు ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారన్నారు. నిర్వహణ బాధ్యతను స్వచ్ఛంద సంస్థలకు కాకుండా నిరుద్యోగులకు అప్పగించాలన్నారు. పివైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి భూషణవేణికృష్ణ మాట్లాడుతూ న్యూ ఎడ్యుకేషన్ పాలసీని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కిరణ్, మల్లేష్, సహాయ కార్యదర్శులు బంగారి శ్రీనివాస్, యల్లప్ప, కోశాధికారి కొల్లూరి భీమేష్, సభ్యులు బాలు, ప్రకాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంవత్సరంలో మరింత అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడ: కొత్త సంవత్సరంలో అంబర్‌పేట నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేసి మోడల్ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆయన కొత్త సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని త్వరితగతిన పూర్తి చేసి కొత్త అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతానని తెలిపారు. నియోజక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ఫ్యామిలీ డే వేడుకలు

కాచిగూడ: బడిచౌడిలోని సెయింట్ థామస్ చర్చిలో ఆదివారం ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిడ్డి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులను ప్రదానం చేశారు. క్రిస్టియన్ల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

నేటి నుంచి ఇంటింటికి అయోధ్య అక్షింతలు

కాచిగూడ: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా దేశ వ్యాప్తంగా జనసంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు పండరీనాథ్, వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు తెలిపారు. జనవరి 1 నుంచి 15 వరకు (15 రోజుల పాటు) జనసంపర్క అభియాన్ కొనసాగుతుందన్నారు. ప్రతి హిందువును ఈ మహాయజ్ఞంలో భాగస్వాములను చేయనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటింకి అక్షింతలు పంపిణీ చేసి, అయోధ్య రామ మందిర దర్శనానికి ఆహ్వానం పలుకుతున్నట్లు వారు పేర్కొన్నారు.

కల్తీ పాలకు అడ్డుకట్ట వేయండి



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

నల్లకుంట: రాష్ట్రంలో సరైన అనుతులు లేకుండా నాసిరకం పాల ప్యాకెట్లు తయారు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు ఆహార కల్తీ నిరోధక శాఖ ఉన్నతాధికాలను కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ సి. శివలీల, డిప్యూటీ కంట్రోలర్ విజయ్ కుమార్‌లకు మండలి ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, పల్లెపాడు దామోదర్, మామిడి భీంరెడ్డి, ఐజాక్ రాజ్ తదితరులు వినతి పత్రం అందజేశారు. పాల నాణ్యతపై 'ఎఫ్' ఫోర్టిఫైడ్ అనుమతులు లేకుండా, నాణ్యతకు సంబంధించి లేబోరేటరీల అనుమతులు లేకుండా వివిధ రాష్ట్రాల నుంచి నాసి రకం పాలను సేకరించి ప్యాకింగ్ చేసి రాష్ట్ర వ్యాప్తంగా అమ్మకాలు చేపట్టి సొమ్ముచేసుకుంటూ, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కల్తీ పాలు, పాల ఉత్పత్తిదారులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ



కానుకలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్‌లోని ప్రేయర్ పవర్ చర్చి, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చిలో పేద క్రైస్తవులకు ఆదివారం క్రిస్మస్ కానుకలను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపిణీ చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తగరం అనిల్‌కుమార్, ఎల్.డి. సామ్‌సన్, డి.అనిల్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నప్పరెడ్డి, ప్రవీణ్, సుజిత్, బ్రదర్ శ్యామూల్, రాబర్ట్ లాజరస్, జోసెఫ్, విన్సెంట్, పల్లి దేవదాస్, మాణిక్యం, లిండా పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం



నాయిని బుచ్చిరెడ్డిని సన్మానిస్తున్న మాజీ మంత్రి కృష్ణ యాదవ్



కరసేవకులను సన్మానిస్తున్న దృశ్యం

కవాడిగూడ: అయోధ్య రామమందిర నిర్మాణానికి 1990లో జరిగిన కరసేవలో పాల్గొన్న వారిని అయోధ్య శ్రీ రామజన్మభూమి ట్రస్ట్ తీర్థ దోమలగూడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. జనవరి 22న శ్రీ రామ్‌లాలా విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతున్న నేపథ్యంలో కరసేవకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బౌదిక్ ప్రముఖ్ క్షీరసాగర్ శివాజీ, కస్తూరి రంగన్, కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరసేవకులు జి. వెంకటేష్, టి. రవీందర్, కె. ఆంజనేయులు, పి. ఆంజనేయులు,ఎస్. రఘునందన్, ఆర్ శ్రీనివాస్‌గౌడ్, చరణ్, శ్రావణ్, పి. రమేష్ కుమార్‌లను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. రామ మందిరం పూర్తయిన నేపథ్యంలో జనవరి 22న దేశ వ్యాప్తంగా దీపావళి సంబరాలు జరుపుకోవాలని వారు సూచించారు. ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించి రాముని చిత్రపటానికి పూజలు నిర్వహించాలన్నారు. వై శ్రీనివాస్, జి. ప్రేమ్‌కుమార్, పాస్‌పోర్టు శ్రీనివాస్, శంకర్, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, శ్రీనివాస్ ముదిరాజ్, శివరాజ్ పాల్గొన్నారు.

టీఆర్టీ కాలనీలో..

నల్లకుంట: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అంబర్‌పేట నియోజక వర్గానికి చెందిన కరసేవకులకు ఆదివారం నల్లకుంట టీఆర్టీ కాలనీలో సన్మాన కార్యక్రమం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సి.కృష్ణా యాదవ్, నల్లకుంట కార్పొరేటర్ అమృత తదితరులు కరసేవకులు నాయిని బుచ్చిరెడ్డి గురుస్వామి, శ్రీనివాస్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎంబీ. కిశోర్ కుమార్, మహేష్ ముదిరాజ్, నర్సింగ్ రావు, కేజే. బాబు, లక్ష్మణ్ కుమార్, సుమన్, మధుసూదన్ పాల్గొన్నారు.

ధరణిని రద్దు చేసి ప్రజల కష్టాలు తీర్చాలి

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ధరణిని రద్దు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. కొంత కాలంగా రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వీఆర్‌ఓలను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రైతుబంధు, రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంతోష్ సాగర్, రాజు, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అభినందిస్తున్న భూపేష్ సాగర్

మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బీజేపీ హైదరాబాద్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ ఆధ్వర్యంలో బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆయన బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందువులు అనేక దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న అయోధ్య రామమందిర నిర్మాణ కల నెరవేరుతుందన్నారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 22న ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలని, వర్చ్యువల్‌గా శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించాలని, మంగళ హారతిలో పాల్గొని శ్రీరాముడి కృపకు పాత్రులు కావాలన్నారు. దేశ ప్రతిష్ఠను విశ్వవ్యాప్తంగా ఇనుమడింప చేసేందుకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.నందకిషోర్ యాదవ్, శ్యామ్‌రాజ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, పాతకోటి మహేష్, శ్రీకాంత్, ఎంబీ కిషోర్, నర్సింగ్‌రావు, కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.